నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | HYDERABAD



సమ్మక్కసారక్కకు మొక్కులు చెల్లించేందుకు మోండామార్కెట్‌లో నిలువెత్తు బంగారాన్ని తూకం వేస్తున్న దృశ్యం

## వ్యర్థాల సేకరణ 5.45 గంటల్లోగా..



సిటీబ్యూరో: పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్, స్వచ్ఛ భారత్, రాంకీ ప్రతినిధులతో పాటు శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌తో కలిసి పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. స్వచ్ఛ ఆటో కేటాయించిన ఇండ్లకు రోజు వారీ లక్ష్యం మేరకు సేకరణ పూర్తి చేయాలన్నారు. స్వీపింగ్ యంత్రాలపై నిఘా పెట్టాలని, నిర్దేశించిన సమయం వరకు స్వీపింగ్ చేయించాలన్నారు. చురుగ్గా పనిచేసే కార్మికులకు బహుమతి అందజేయాలన్నారు. ఉదయం 5.45 గంటల్లోగా జీవీపీ పాయింట్లలో వ్యర్థాల సేకరణ, ప్రధాన రహదారులపై ఉదయం 7 గంటల వరకు శుభ్రం చేసే విధంగా జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు డీసీలు, జోనల్ కమిషనర్లు మానిటరింగ్ చేయాలన్నారు.

## మేడారం బంగారం ఇంటి వద్దకే..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ) : భక్తుల కొంగు బంగారంగా వరాలను అందించే సమ్మక్క-సారలమ్మ ప్రసాదాన్ని ఇంటి వద్దే పొందేందుకు వీలుగా పోస్టల్ శాఖ నూతన సేవలను ప్రారంభించింది. బుధవారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి రాగా, నిర్ణీత రుసుం చెల్లించి కిలో బంగారాన్ని(బెల్లం) ప్రసాదంగా పొందవచ్చు. కేజీ బంగారం ధర రూ. 60 చొప్పున విక్రయిస్తుండగా, జాతర ముగిసిన వెంటనే స్పీడ్ పోస్టు ద్వారా ప్రసాదాన్ని ఇంటి వద్దే పొందేందుకు డెలివరీ సేవలను ఏర్పాటు చేసినట్లు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎన్. రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు.




## బస్సులు లేక బేజార్

*నగరంలో సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు రెట్టింపవుతున్నా.. ఇందుకు అవసరమైన సర్వీసులు నడపడంలో ఆర్టీసీ వెనుకబడుతున్నది. దీనికి తోడు మేడరం జాతర కోసం కొన్ని బస్సులను అటువైపు మళ్లించడంతో నగరవాసుల కష్టాలు మరింత పెరిగాయి. ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర పనుల కోసం వెళ్లేవారు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది.*

## బల్దియా అడిషనల్ కమిషనర్‌పై బదిలీ వేటు

### డిప్యూటేషన్‌పై వచ్చిన కమిషనర్లకు పోస్టింగ్



సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో అంతర్గత బదిలీలు జరిగాయి. ఇటీవల రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ కమిషనర్లు డిప్యూటేషన్‌పై వచ్చిన వారికి పోస్టింగ్ ఇవ్వడంతో పాటు సంస్థలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అదనపు కమిషనర్ సరోజపై బదిలీ వేటు వేశారు. రెండు రోజుల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో సరోజ పనితీరుపై సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఏ మాత్రం తగదని హెచ్చరించారు. ఈ మేరకు సరోజను బదిలీ చేస్తూ..బుధవారం కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడ్మిన్ విభాగానికి అదనపు కమిషనర్ ఉన్న సరోజను డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీస్ విభాగానికి బదిలీ చేశారు. డిప్యూటేషన్‌పై బల్దియాకు వచ్చిన మున్సిపల్ కమిషనర్లు జి. నళిని పద్మావతి, కె.సత్యనారాయణ, జి. వేణుగోపాల్‌రెడ్డి, మహ్మద్ షేక్‌లకు పోస్టింగ్‌లు ఖరారు చేశారు. జి.నళిని పద్మావతికి ప్రధాన కార్యాలయంలో అడ్మిన్ విభాగానికి, లీవ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారి శ్రీవాత్సవకు సంబంధించిన లీగల్, ఎలక్ట్రికల్ విభాగం బాధ్యతలను తాత్కాలికంగా కె.సత్యనారాయణకు అప్పగించారు. శేరిలింగంపల్లి జోన్ ఎస్‌డబ్ల్యూఎంకు జి. వేణుగోపాల్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎస్‌డబ్ల్యూఎం డీసీగా మహ్మద్ షేక్‌లకు బాధ్యతలు అప్పగించారు.

## హోటళ్లలో క్వాలిటీ లేకుంటే

# కఠిన చర్యలే

### స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్న బల్దియా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : నాణ్యతా ప్రమాణాలను పాటించని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై ఉక్కుపాదం మోపేందుకు బల్దియా ప్రత్యేక డ్రైవ్‌కు సిద్ధమైంది. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఆయా సెంటర్లపై తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. వాస్తవంగా కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు వరకు నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్‌ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు వ్యాపారాలను సాగిస్తున్నారు. వంట గదులు పరిశుభ్రత పాటించడం లేదు. ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మాసాలాలు దట్టించి.. మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచూ జీహెచ్‌ఎంసీకి నిత్యం 10 వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బల్దియా కల్తీరాయుళ్ల భరతం పట్టాలని నిర్ణయించింది.ఈ మేరకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నాణ్యత పాటించని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు తొలుత జరిమానాలు, ఆ తర్వాత సంబంధిత వాటిని సీజ్ చేయడం వంటి చర్యలు చేపట్టనున్నది. కల్తీ ఉన్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆహార నాణ్యతా ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040- 2111 1111లో సంప్రదించాలని అధికారులు కోరారు. కాగా హాని కలిగించే విధంగా వ్యాపారం చేసిన వారు ఇప్పటికే పలు యాక్టుల కింద కోర్టులో కేసులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం 119 సీసీ కేసులు నడుస్తున్నాయని అధికా



**ఫిర్యాదు కోసం**
**040- 2111 1111**

**ఆహార కల్తీ విషయంలో తీసుకున్న చర్యలు**

**2021 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -12375 |
| నోటీసులు జారీ చేసినవి | -926 |
| సేకరించిన ఆహార నమూనాలు | -978 |
| ఉల్లంఘనలు | -129 |
| భద్రత లేనివి | -33 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -64 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -32 |

**2022 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -17209 |
| నోటీసులు జారీ చేసినవి | -3962 |
| సేకరించిన ఆహార నమూనాలు | -2322 |
| ఉల్లంఘనలు | -279 |
| భద్రత లేనివి | -32 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -94 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -153 |

**2023 సంవత్సరంలో**

| | |
|---|---|
| తనిఖీలు | -14889 |
| నోటీసులు జారీ చేసినవి | -3803 |
| సేకరించిన ఆహార నమూనాలు | -2534 |
| ఉల్లంఘనలు | -311 |
| భద్రత లేనివి | -34 |
| తక్కువ ప్రమాణాలతో ఉన్నవి | -265 |
| మిస్‌బ్రాండ్ కలిగి ఉన్నవి | -12 |

### కనిపించని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్

రోజు వాడే ఆహార పదార్థాలలో కల్తీ జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ఫుడ్ సెక్యూరిటీ స్టాండెడ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' మొబైల్ వ్యాన్ రోజుకో సర్కిల్‌లో ఉండాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా ఈ వాహనం ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వంలో పెద్దల మెప్పు పొందే వీలుగా ఈ వాహనాన్ని కొందరు అధికారులు పక్కదారి పట్టించినట్లు చర్చ జరుగుతున్నది. వెంటనే సర్కిల్‌లో ఈ వాహనంతో మొదటగా అవగాహన, టెస్టింగ్, ట్రైనింగ్ వీధి వ్యాపారులకు కల్పించాలని డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి.




మాట్లాడుతున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

## కమిట్‌మెంట్‌తో పనిచేయండి

### తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురండి

### సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి.. కొత్త కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): 'కష్టపడి ఉద్యోగం సాధించారు..కమిట్‌మెంట్‌తో పనిచేయండి' అని నూతనంగా ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్లకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఫ్లేట్ల బురుజులోని సిటీ పోలీస్ శిక్షణ సంస్థలో ఇటీవల నియమితులైన 268 ఎస్సీటీపీసీ(స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్), ఏఆర్(మహిళలు), రాష్ట్రం నలుమూలల నుంచి డ్రైవర్లు, మెకానికల్ తదితర విభాగాలకు చెందిన 9 నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణకు రిపోర్టు చేశారు. బుధవారం వాళ్లకు శిక్షణ ప్రారంభమవ్వగా, ఈ కార్యక్రమానికి సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంపై పూర్తి అవగాహన పెంచుకొని.. ప్రజల ఆస్తులను కాపాడాలని, విధి నిర్వహణలో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. వృత్తి ధర్మాన్ని క్రమ శిక్షణ, సమయపాలన పాటిస్తూ, కమిట్‌మెంట్‌తో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలను పెంచుకోవాలి: సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

శిక్షణలో సంస్థాగత విలువలు పాటిస్తూ, సమాజంపై పూర్తి అవగాహన పెంపొందించుకుంటూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సూచించారు. కొత్తగా నియామకమైన స్టైంపడరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు 9 నెలల పాటు జరిగే బేసిక్ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దిపేట, మెదక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం యూనిట్లకు చెందిన 196 మందికి శిక్షణ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం సాధించడం కోసం కొన్ని లక్షల మంది నిరుద్యోగులు అహోరాత్రులు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారని, అందులో కొందరికే ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. అందులో మీరు ఉన్నారని, తెలంగాణ పోలీసులకు దేశంలోనే బెస్ట్ పోలీసింగ్‌గా గుర్తింపు ఉన్నదన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడం కోసం శిక్షణ సమయం చక్కని అవకాశమని, స్వీయ క్రమ శిక్షణ పాటించాలని సూచించారు. జాయింట్ సీపీ ట్రాఫిక్, జోయెల్ డేవిస్ మాట్లాడుతూ 9 నెలల శిక్షణపైనే సర్వీస్ మొత్తం ఆధారపడి ఉంటుందని, శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకోవాలని, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై క్షేత్ర స్థాయిలో కానిస్టేబుళ్లు పనిచేస్తారని, డిపార్టుమెంట్‌లో కానిస్టేబుల్ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ డీసీపీ ఎల్‌సీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి





### • జర భద్రం..ప్రమాదం..

బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయానికి కరెంటు అందించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఇలా నిర్లక్ష్యంగా నేలపై నుంచి అమర్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ తీగను దాటుకుంటూనే..కార్యాలయానికి వస్తున్నారు.

-బడంగ్‌పేట, ఫిబ్రవరి 21

## మూసీ తీరంలో ఈస్ట్-వెస్ట్ కారిడార్

### రోడ్డు, మెట్రో మార్గంపై ప్రాథమిక అధ్యయనం

### సీఎం సూచనల మేరకు క్షేత్ర స్థాయిలో సర్వే

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. మూసీ నదిలో నీటిని స్వచ్ఛంగా ఉంచడంతో పాటు పరివాహక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, వాణిజ్య సముదాయాలను నిర్మించడం వంటి దీర్ఘకాలిక ప్రణాళికలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. రవాణా ఆధారిత అభివృద్ధిపైనా ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు రవాణా పరంగా మహానగరానికి మణిహారంలా మారింది. అలాంటి ఔటర్ రింగు రోడ్డును తూర్పు నుంచి పడమర కలిపే ప్రాజెక్టును మూసీ తీరం వెంబడి చేపట్టడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని గుర్తించి, ఈస్ట్-వెస్ట్ కారిడార్ ప్రతిపాదనపైనా ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. కేవలం మూసీ సుందరీకరణలో భాగంగా ల్యాండింగ్ స్కేపింగ్ పనులు చేస్తే దానికి ప్రాధాన్యత ఉండదని, రవాణా పరంగా రోడ్డు మార్గంతో పాటు మెట్రో రైలు మార్గాన్ని జత చేయడం ద్వారా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విజయవంతం అయ్యేందుకు అనుకూల వాతావరణం ఉంటుందని నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై సమీక్ష చేసిన సమయంలో హైదరాబాద్ మెట్రో అధికారులతోనూ ప్రత్యేకంగా ఈస్ట్-వెస్ట్ కారిడార్ ప్రాధాన్యతపై ప్రధానంగా చర్చించారు.



నగరం మధ్యలోంచి..

గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డును నగరం మధ్యలోంచి కలిపేందుకు ఈస్ట్-వెస్ట్ కారిడార్ అత్యంత అనుకూలమైందని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించి, దీనిపై సమగ్ర అధ్యయాన్ని చేపట్టింది. ప్రాజెక్టును చేపట్టాలన్న లక్ష్యంతో 2018 మార్చి 3న కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు లేఖను రాసింది. మళ్లీ తాజాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మూసీ తీరం వెంబడి రోడ్డు మార్గంతో పాటు మెట్రో మార్గాన్ని చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన సమీక్షలో మెట్రో మార్గం నిర్మాణంపైనా సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో అధికారులకు సూచించారు. పడమర దిక్కున నార్సింగి ఓఆర్‌ఆర్ నుంచి మొదలు కొని తూర్పు దిక్కున గౌరెల్లి వద్ద ఓఆర్‌ఆర్‌ను మూసీ మీదుగా రోడ్డు, మెట్రో మార్గం నిర్మాణ సాధ్యాసాధ్యాలపై వెంటనే అధ్యయనం చేసేందుకు మెట్రో అధికారులు సిద్ధమయ్యారు. రవాణా ఆధారిత అభివృద్ధి అనే నినాదాన్ని మూసీ తీరంలో విజయవంతం చేసేందుకు ఉన్న అవకాశాలను గుర్తించనున్నారు. మూసీ సుందరీకరణ తర్వాత పర్యాటకంగా కేంద్రంగా ఆదరణ ఉండాలంటే రోడ్డు, మెట్రో రైలు కనెక్టివిటీ చాలా కీలకంగా మారుతుందని ప్రాథమికంగా నిర్ణయించారు. త్వరలోనే మెట్రో అధికారులు మూసీ వెంబడి ఈస్ట్-వెస్ట్ కారిడార్‌కు సంబంధించి క్షేత్ర స్థాయిలో ప్రాథమిక అధ్యయనం పనులు చేపట్టనున్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించిన తర్వాత డీపీఆర్‌ను రూపొందించేందుకు అవకాశముంటుందని మెట్రో అధికారి ఒకరు తెలిపారు.

## ఆ ఇద్దరినీ..

## విధి విడదీసింది

మేడ్చల్, ఫిబ్రవరి 21 : ప్రేమికులను విధి విడదీసింది.. రెప్పపాటులో వారి జీవితాల్లో చీకట్లు నింపింది. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, యువతి తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం.. వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసముండే ప్రేమికులు.. బుధవారం ఉదయం శామీర్‌పేటకు ద్విచక్రవాహనంపై వచ్చారు. ఎంతో సరదాగా తిరిగి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన పాల ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగప్ప అలియాస్ విక్కి(24) తల చిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంపై వెనుక కూర్చొన్న యువతికి తీవ్ర గాయాలయ్యాయి. కండ్ల ముందే తను ప్రేమించిన వాడు.. విగతజీవిగా మారడంతో ఆమె హతశురాలైంది. యువతిని సకాలంలో గాంధీకి తరలించడంతో ప్రాణాలు దక్కాయి.



## మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు

### హైదరాబాద్‌లో 361 కేంద్రాలు

### పరీక్షకు హాజరుకానున్న 76,575 మంది విద్యార్థులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ) : మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. పరీక్ష సమయం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటుందన్నారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 361 (రెగ్యులర్ 349, ప్రైవేట్ 12) పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. మొత్తం 76,575 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. రోహిణి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జే.నర్సింగ్‌రావు, బి. నరసింహ, జరీన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.